సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక శివారు కర్రివానిపాలెంలోని సంతోషి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధి దాసరి సన్యాసిరావు మాట్లాడుతూ శివరాత్రి తెల్లవారుజామున అప్పికొండ సముద్ర స్నానానికి వీలుగా ఆర్టీసీ సిటీ బస్ సౌకర్యం కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భెల్ కో-ఆపరేటివ్ సొసైటీకి 26 నామినేషన్లు



నామినేషన్లు సమర్పిస్తున్న సభ్యులు

గాజువాక: బీహెచ్ఈఎల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు 26 మంది సభ్యులు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఎనిమిది మంది పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవడం కోసం నిర్వహించనున్న ఈ ఎన్నికల్లో ప్రొగ్రెసివ్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, పరిరక్షణ ఫ్రంట్‌ల నుంచి ఎనిమిది మంది చొప్పున నామినేషన్లు దాఖలు చేయగా, మరో ఇద్దరు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు అందజేశారు. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 17న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి సీహెచ్.ఎస్.త్రినాథరావు తెలిపారు.

రికార్డుల మాయంపై లోకాయుక్తకు ఫిర్యాదు

అగనంపూడి: ఉక్కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు మాయం కావడంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు తెలిపారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసేకరణ కార్యాలయంలో కాలనీల వారీగా నిర్వాసితుల అర్హుల జాబితా, పట్టాలు, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారి జాబితా కోసం స.హ. చట్టం ద్వారా దరఖాస్తు చేయగా వివరాలు లేవని, మాయం అయ్యాయని అధికారులు సమాధానం చెప్పారన్నారు. ఈ వ్యవహారంలో దీర్ఘకాలికంగా కార్యాలయంలో తిష్టవేసిన ఒక ఉద్యోగిని పాత్ర ఉందని, ఆమె చెప్పినట్టు ఉన్నతాధికారులు నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఆమె పాత్రపై దర్యాప్తు చేయాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు దానబాల త్రిమూర్తులు, ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ



డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం సౌభాగ్యలక్ష్మిగా దుర్గాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రకరకాల రంగుల గాజులతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఇష్టానుసారం తవ్వేస్తున్నారు

- కొండయ్యవలసలో ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీ తవ్వకాలు
- అసంపూర్తి పనులతో సీసీ రోడ్లు ఛిద్రం



తవ్విన అనంతరం నామమాత్రంగా కప్పేసిన దృశ్యం



కొండయ్యవలస మెయిన్‌రోడ్ మధ్యలో తవ్వకాలు చేపడుతున్న ఏసీటీ సంస్థ

అగనంపూడి: ప్రైవేటు నెట్‌వర్క్ సంస్థలు బాగున్న రోడ్లను ఛిద్రం చేసేస్తున్నాయని కొండయ్యవలస వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని గ్రామం ప్రధాన సీసీ రోడ్డును ఏసీటీ ప్రైవేటు నెట్‌వర్క్ సంస్థ తవ్వుకుంటూ పోతోంది. రహదారి మలుపుల్లో, రోడ్డు మధ్యలో తవ్వకాలు చేపడుతూ, కేబుళ్లు అమర్చిన తరువాత వాటిని తూతూమంత్రంగా కప్పి చేతులు దులిపేసుకుంటుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. డ్రిల్లింగ్ మిషన్‌తో గోతులు తవ్వుతున్న కాంట్రాక్టర్ రహదారి మధ్యలో తవ్విన తరువాత, వాటిని కాంక్రీట్‌తో పూడ్చాల్సింది పోయి మట్టితో కప్పేసి వెళ్లిపోతున్నారు. ఆ గోతులు తరువాత పెద్దవిగా మారి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. రహదారి తవ్విన తరువాత యథావిధిగా నిర్మించే బాధ్యతను సదరు సంస్థ తీసుకోవాలి. వాటిని పర్యవేక్షించి పునర్నిర్మాణం చేపట్టేలా జీవీఎంసీ అధికారులు ఒత్తిడి తీసుకురావాలి. అయితే ఇవేవీ జరగకపోవడంతో స్థానికులు తవ్వకాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల గోతులు ఏర్పడితే, ఎవరు పూడ్చుతారని స్థానిక మహిళలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.



రోడ్డు మలుపులో తవ్వి, ఏర్పాటు చేసిన కేబుల్స్

డంపింగ్‌యార్డ్ తరలింపునకు వినతి



ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్‌ను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ఆ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు 16 గ్రామాలకు చెందిన నాయకులతో కలసి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన కారణంగా 16 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వ్యాధులు వెంటాడుతున్నాయని తెలిపారు. వెంటనే యార్డును ఇక్కడి నుంచి తరలించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి చర్యలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఎం నాయకుడు రాంబాబు, ముమ్మన మురళి, బలగ రామారావు, రమణ, శంకరరావు, భాస్కరరావు, నాయుడు, దుర్యోధన, పలు గ్రామ కమిటీల ప్రతినిధులు ఉన్నారు.

స్టీల్ ఓబీసీ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ



నూతన కమిటీకి పత్రం అందజేస్తున్న హెచ్ఆర్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో నూతన కమిటీ గెలుపొందిన విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా హెచ్ఆర్ జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ జి. అప్పారావు, ఎన్నికల అధికారి జె.వి. రావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓబీసీ సంఘానికి యాజమాన్యం తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. నూతన కమిటీకి హెచ్ఆర్ ఉన్నతాధికారులు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు బి.అప్పారావు, యు. శ్రీనివాస్, కోయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న లారీలు

ఆందోళనకు దిగిన గంగవరం యువకులు



శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు

పెదగంట్యాడ: ఇరుకు మార్గాల్లో లారీల రాకపోకలపై గంగవరం నాలుగు గ్రామాలకు చెందిన యువకులు బుధవారం ఆందోళన చేపట్టారు. పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే రహదారిలో శ్రావణ్ షిప్పింగ్ కంపెనీకి రాకపోకలు సాగించే లారీల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ మేరకు శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ ఎదుట గంగవరం, పెదపల్లిపాలెం, జాలరిపల్లిపాలెం, చినపల్లిపాలేనికి చెందిన యువకులు ఆందోళనకు దిగారు. భారీ వాహనాల రాకపోకల కోసం సమయాన్ని కేటాయించినా ఎక్కడా అమలు చేయడం లేదని తెలిపారు. వేళాపాళా లేకుండా లారీలు దూసుకొస్తుండటంతో స్థానికులు హడలిపోతున్నారని, వేగ నియంత్రణ కోసం ఈ రోడ్డులో కనీసం స్టాపర్ బోర్డులైనా కనిపించడం లేదని తెలిపారు. వీధి దీపాలు సక్రమంగా వెలగక, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ ఘటనల్లో మూగజీవాలు కూడా గాయపడుతున్నాయని చెప్పారు. ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రం రెండు మూడు రోజుల పాటు పోలీసులు హడావుడి చేస్తున్నారు తప్ప, తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా చినతల్లి

గాజువాక: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేని చంద్రబాబు అసత్యాలను ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి అన్నారు. 67వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖలోనూ టీడీపీకి నూకలు చెల్లిపోయాయని, అందువల్లే ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని పేర్కొన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రకు జనం రావడం లేదని, దీంతో వారికి ఏం చేయాలో తోచక స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు తమ తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో నాయకులు మార్పుపూడి పరదేశి, అచ్చంనాయుడు, ఎం.లక్ష్మి, మీరాబాయి, జోసెఫ్, కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా గరుడసేవ

సింహాచలేశుడికి బుధవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

విశేషంగా సహస్ర నామార్చన

వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు 1001 నామాలతో పూజ చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.



మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు



మహా శివరాత్రి వేడుకలకు సాగర తీరం ముస్తాబవుతోంది. జాగరణ కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టి.సుబ్బరామిరెడ్డి కళా పీఠం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో శనివారం నిర్వహించనున్న మహా కుంభాభిషేకం కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. - బీచ్ రోడ్డు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు మరియు ఉక్కు నిర్వాసితుల జీవితాలను అయోమయంలోకి నెడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యంగా, ప్రజల భాగస్వామ్యంతో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 734వ రోజు, బుధవారం ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి దేముడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను పెంచారని, అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపద అని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డి.రమేష్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, జి.ఆనంద్, టి.ఎం.మోహన్ కుమార్, వర్మ, జి.వి.రమణారావు, కె.ఆర్.కె.రాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతికతను అంది పుచ్చుకుంటే ఉజ్వల భవిత



విద్యార్థులతో అధ్యాపకుల బృందం

అగనంపూడి: విద్యార్థుల ఆలోచనా దృక్పథం, ధోరణిలో మార్పులు రావాలని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి సూచించారు. ఎంబీఏ విద్యార్థుల మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రోజురోజుకూ వాణిజ్యపరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీన్ హరగోవిందరావు, ఎంబీఏ హెడ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



పోటీల వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి 18 వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని శ్రీ మాతృశ్రీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మైది పరమేశ్వరరావు తెలిపారు. పోటీల వివరాలను గంగవరంలో బుధవారం వెల్లడించారు. గంగవరంలోని రామాలయం చావిడిలో నిర్వహించనున్న ఈ పోటీలను రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. రోజూ సాయంత్రం ఫ్లడ్ లైట్ల వెలుగులో సింథటిక్ మ్యాట్‌పై ఈ పోటీలు ఉంటాయన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు వంతున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శంకరరావు, ఆర్గనైజర్ కారి దేముడు, ప్రసాద్‌రెడ్డి, కారి లక్ష్మణ్, భూలోక పాల్గొన్నారు.

మహాభారతంపై సాహిత్య ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహాభారతంలో విశేషాంశాలు అనే అంశంపై సాహితీవేత్త టీపీఎస్ ఆచార్యులు ప్రసంగించారు. ముందుగా వ్యాసుని జన్మవృత్తాంతం.. ఆపై సహస్ర కవచ రాక్షసుడితో నరనారాయణుల యుద్ధం, ఒక్క కవచంతో సూర్యుడి శరణు వేడుట అతడే కర్ణుడిగా జన్మించడం, వాని సంహారానికి నరనారాయణులు కృష్ణార్జునులుగా పుట్టారని తెలిపారు. శకుంతలోపాఖ్యానం, ఉడిపి రాజు అనే సూరసేనుడు కురుక్షేత్ర సంగ్రామంలో ఇరుపక్క సైనికులకు ఆహారం వండి పెట్టడం, కలి ప్రవేశం, పరీక్షిత్తు క్రోధం, శృంగి శాపం, యాదవుల నాశనానికి కారణం వంటి విశేషాంశాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో ఎన్నో ధర్మ సూత్రాలు, జీవిత సత్యాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. మహాభారతం నేటికీ మనందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, అయ్యల సోమయాజుల ప్రసాద్, గండికోట విశ్వనాథం, రామతాత, మాణిక్యాలరావు చర్చించారు.

మహా శివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు

- లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదేశాలు
- వివిధ శాఖల అధికారులతో సమావేశం



అప్పికొండ ఆలయంలో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయానికి లక్షల్లో వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అధికారులను ఆదేశించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన చేసిన సూచనలు..

- భక్తులు ఇక్కడే జాగారం చేసి, తీరంలో స్నానాలు ఆచరిస్తారు గనుక అత్యవసర వేళలో అందుబాటులో ఉండేలా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి.
- తాగునీరు, టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయాలి.
- ఆలయ పరిసరాలతో పాటు తీరంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత జీవీఎంసీ పారిశుధ్య అధికారులదే.
- దారి పొడుగునా ఉన్న విద్యుత్ స్తంభాల దీపాలు వెలిగేలా ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలి.
- పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలి.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించాలి.

సమావేశంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ త్రినాథ్, తహసీల్దార్ రమాదేవి, ఈవో కీర్తి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గంగరాజు, ఆలయ అర్చకుడు చదువుల నాగరాజు, శివకుమార్, వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో స్థాయిలో ఉద్యోగం వరం



క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్‌బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటినెన్స్ ఇంజినీర్ బి.సాహుల్ ఇబ్రహీం, హెచ్ఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్వేరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.



